PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

RNI NO.TELTEL/2022/83842

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 295 | సంపుటి 4 | మంగళవారం | 28-07-2026 | పేజీలు 4 | వెల 3/-



## తిమింగలాలను వదిలి..

# చిన్న చేపలపై కన్ను!



- ధాన్యం మింగేసిన పెద్ద మనుషులపై విజిలెన్స్ అధికారులకు కరుణ ఎందుకో?
- చిన్నకారు వ్యాపారులపై ప్రతాపం ఏలా
- హుటాహుటిన హైదరాబాద్ కు బడా మిల్లర్లు పరుగో పరుగు
- నేతల ఇళ్ల చుట్టూ రాత్రికి రాత్రే ప్రదక్షిణలు
- ఇంత జరుగుతున్నా కలెక్టర్ మేడం మౌనం?
- 'ధాన్యం 'ని బుక్కిన ప్రతీ ఒక్కరిపై చర్యలు తీసుకోండి అంటూ ప్రజల వేడుకోలు

కేసముద్రంజూలై27(ప్రభాతగమనం):

ప్రభుత్వం పేదల బియ్యం కోసం, రైతుల శ్రమకు వెచ్చించే కోట్ల రూపాయల ధాన్యం నిధులు అడ్డగోలుగా పక్కదోవ పడుతున్నా... అధికారులు మాత్రం 'తూతూ మంత్రం' తనిఖీలతో సరిపెట్టుకుంటున్నారు. కేసముద్రం మండలంలో రైస్ మిల్లర్ల అవినీతి అక్రమాలు పరాకాష్టకు చేరినా, సివిల్ సప్లై మరియు విజిలెన్స్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని మాయం చేసిన 'కోటిగాళ్లను' వదిలేసి, ఏమీ ఎరగని చిన్న చిన్న వ్యాపారులు, బుడ్డపరకలపై అధికారులు తమ ప్రతాపాన్ని చూపిస్తుండటం స్థానికంగా ఆగ్రహ జ్వాలలు రగిలిస్తోంది.కేసముద్రంలో రైస్ మిల్లర్ల అక్రమాలపై వ్యక్తమవుతున్న నిరసనల నేపథ్యంలో, నిజానికి ఆదివారం మిల్లర్ల అసోసియేషన్ ఒక అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ధాన్యం నిల్వలు, సీఎంఆర్ బకాయిలపై స్పష్టత తీసుకోవాలని భావించారు. అయితే, ఏమైందో ఏమో గానీ, ఆ సమావేశం రద్దు చేసుకున్నారని తెలుస్తుంది. తనిఖీల భయంతో పాటు, అధికారుల తీరుపై అనుమానాలు రావడంతో బడా మిల్లర్లు సమావేశాన్ని పక్కనబెట్టి, హుటాహుటిన హైదరాబాద్ బాట పట్టడం సంచలనంగా మారింది.విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కేసముద్రంలోని పలు రైస్ మిల్లుపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు విరుచుకుపడే అవకాశం ఉందని బలమైన ప్రచారం జరుగుతోంది. సదరు మిల్లులో పెద్ద ఎత్తున ధాన్యం మాయమైనట్లు, ప్రభుత్వ రికార్డులకు-క్షేత్రస్థాయి నిల్వలకు పొంతన లేదని ప్రాథమికంగా తేలినట్లు తెలుస్తోంది. ఈ దాడి సమాచారం ముందుగానే లీక్ కావడంతో, సదరు మిల్లుల యజమానులు ఇతర బడా మిల్లర్లు విజిలెన్స్ ఉచ్చు నుంచి తప్పించుకునేందుకు హైదరాబాద్ లోని ఓ ప్రముఖ రాజకీయ నేత,అలాగే మంత్రుల ఇళ్ల చుట్టూ పరుగులు తీస్తున్నట్లు సమాచారం. 'మా మిల్లుపై దాడి జరగకుండా చూడండి.. లేదా కేసు తీవ్రత తగ్గించండి' అని పొలిటికల్ రికమండేషన్ల కోసం రాత్రింబవళ్లు ఒత్తిళ్లు తెస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం .ఇన్నాళ్లూ విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు కేసముద్రంలో చేసిన తనిఖీలన్నీ కేవలం 'ఐవాష్' చర్యలేనని ప్రజలు మండిపడుతున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మిల్లులోని ప్యాడీ ని, ప్రతీ గోదామును, లారీ లోడును పక్కాగా లెక్కించాలి.కానీ అధికారులు మాత్రం మిల్లుల వద్దకు రావడం, అక్కడ ఇచ్చే టీ కాఫీలు తాగి నివేదికల్లో 'అంతా సవ్యమే' అని సంతకాలు పెట్టి వెళ్లడం నిత్యకృత్యమైంది.ఇటీవల కేసముద్రం మండలంలోని ఓ ప్రధాన మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు జరిపి అంతా సరిగానే ఉందని నివేదిక ఇచ్చి చేతులుదులుపుకున్నారు.రైతుల నుంచి సేకరించిన వేల టన్నుల వరి ధాన్యం మిల్లుల్లో కాకుండా బయటి మార్కెట్లకు ఏ విధంగా తరలిపోయిందో తెలిసినా అధికారులు మౌనం వహించడం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల' పర్వం నడిచిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని, ప్రభుత్వం పేదలకు అందించాల్సిన బియ్యాన్ని బుక్కిన ఏ ఒక్క రైస్ మిల్లర్ నూ వదలకుండా కఠినంగా శిక్షించాలి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, కేసముద్రం పరిధిలోని అన్ని మిల్లులపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేయాలి. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ బియ్యం దందాను అరికట్టి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి.ప్రస్తుతం హైదరాబాద్ వేదికగా సాగుతున్న రాజకీయ ఒత్తిళ్లకు జిల్లా యంత్రాంగం, విజిలెన్స్ అధికారులు లొంగుతారా? లేక జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తారా? అనేది జరగబోయే దాడులపై మరియు తదుపరి పరిణామాలపై ఆధారపడి ఉంది. ఏది ఏమైనా, రైస్ మిల్లర్ల దందాపై కేసముద్రం ప్రజలు పోరాట నినాదం ఎత్తుకోవడంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రస్థాయిలో హాట్ టాపిక్ గా మారింది. అధికారులు మరి దొంగతనంగా ప్యాడీ అమ్మిన మిల్లర్ల అంతు చూస్తారా లేక వారు ఇచ్చే మాముళ్లకు లొంగి మౌనంగా ఉంటారా వేచి చూడాలి మరి....

# సింగరేణిని భ్రష్టు పట్టించింది కేసీఆరే

- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

**న్యూఢిల్లీ,ప్రభాతగమనం,జూలై27:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీకి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు



బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేక పోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు. అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లకు తెలంగాణ గౌడ యువజన సంఘం వినతి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

బహుజన విప్లవ వీరుడు, స్వరాజ్య స్థాపకుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుకలను ఆగస్టు 18న గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గౌడ యువజన సంఘం (టీజీవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ గట్టు నరేష్ గౌడ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గట్టు నరేష్ గౌడ్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ బహుజనుల ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని అన్నారు. ఆయన చరిత్ర, త్యాగాలు, స్వరాజ్య స్థాపన కోసం చేసిన పోరాటాలను నేటి తరాలకు తెలియజేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఏడాది ఆగస్టు 18న నిర్వహించే జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి ప్రజల్లో చారిత్రక అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిల్లో జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించి, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాలు, బహుజన సంఘాల ప్రతినిధులు, యువత, ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్లను కోరినట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు ముందస్తు ఆదేశాలు జారీ చేసి అన్ని ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి ప్రధాన కార్యక్రమాన్ని బహిరంగ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులను అధికారికంగా ఆహ్వానించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చరిత్ర, ఆయన చేసిన వీరోచిత పోరాటాలు, బహుజన సమాజానికి అందించిన స్ఫూర్తిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బండారి జనార్దన్ గౌడ్, చిర్ర సుమన్ గౌడ్, నాగపూరి వెంకటేష్ గౌడ్, నరేష్ గౌడ్ తదితర గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## డ్రా ద్వారా బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

- పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాం
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బిఎఎస్) ప్రవేశాలకు సంబంధించిన విద్యార్థుల ఎంపిక ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో డ్రా విధానం ద్వారా పారదర్శకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పక్షపాత ధోరణితో డ్రా నిర్వహించి అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ వివరాల ప్రకారం, 5వ తరగతిలో మొత్తం 62 సీట్లు అందుబాటులో ఉండగా మొదటి విడతలో 52 దరఖాస్తులు మాత్రమే అందాయి. దీంతో మిగిలిన 10 సీట్ల భర్తీ కోసం రెండో విడతలో 17 దరఖాస్తులు స్వీకరించారు. ఈ 10 సీట్లకు 17 మంది అర్హులు ఉండటంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రా నిర్వహించి 10 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మిగిలిన ఏడుగురిని వెయిటింగ్ లిస్టులో ప్రాధాన్యత క్రమంలో ఉంచారు. డ్రా ద్వారా ఎంపికైన విద్యార్థులు శివాని స్కూల్ (నర్సంపేట), ఏవీఎస్ స్కూల్ (ధర్మారం), వందన స్కూల్ (వరంగల్), విద్యోదయ స్కూల్ (నెక్కొండ) తదితర విద్యాసంస్థలను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.సి.డి.ఓ (ఎస్‌ఎసి) పుష్పలత, జిల్లా సంక్షేమ అధికారి (డీసీఓ) సరిత, అకాడెమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

- -తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్,ప్రభాతగమనం,జూలై27:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది.



## ఆగస్టులో అసెంబ్లీ సమావేశాలు

- 17 లేదా 24 నుంచి నిర్వహించే అవకాశం
- కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పలు తీర్మానాలు ప్రవేశపెట్టనున్న సర్కార్
- కొనసాగుతున్న మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణం
- వచ్చే నెల 10లోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశం

**హైదరాబాద్, ప్రభాతగమనం ,జూలై27:**


రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి లేదా 24 నుంచి సమావేశాలు జరగవచ్చని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివా రం జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశా లు పెడుతామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వా రి కనీస వయో పరిమితిని 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

## పార్లమెంటులో గందరగోళం

- మోదీ, అమిత్ షా క్షమాపణలకు పట్టు
- గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా

**న్యూఢిల్లీ, ప్రభాతగమనం :**

పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణలతో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటి వరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల



లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తి చేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి.

## ఐఐటీ విద్యార్థికి కేటీఆర్ భరోసా!

- ల్యాప్ టాప్ అందజేత
- కళాశాల ఫీజు సైతం చెల్లిస్తా అని హామీ
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి అభినవ్, తల్లిదండ్రులు

**హైదరాబాద్, ప్రభాతగమనం, జూలై 27:**

బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు.గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా విద్యార్థులకు తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సోమవారం ఐఐటీ లో వారణాసి లో సీటు సాధించిన సిరిసిల్ల కు చెందిన గడ దాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ,శ్రీలత లతో కలిసి హైదరాబాద్ లో కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.నేత కుటుంబానికి చెందిన అభినవ్ ను ఐఐటి లో సీటు సాధించడంతో కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థికి ల్యాప్టాప్ ను గిఫ్ట్ స్మైల్ కింద అందజేశారు. కళాశాల ఫీజు కూడా తాను చెల్లిస్తానని భరోసా ఇచ్చి, చక్కగా చదువుకొని , తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని , ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు విద్యార్థి అభినవ్, తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ శ్రీలతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్ కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.



## లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం

- చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- సమాచారం అందించిన వారికి రూ.50 వేల ప్రోత్సాహకం
- డీఎంహెచ్‌వో డా. ఏ. అప్పయ్య

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

లింగ వివక్షతను నిర్మూలించి, బాలికల జననాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏ. అప్పయ్య తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం (పీసీ అండ్ పి.ఎన్.డీ.టీ యాక్ట్) అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) నివేదిక ఆధారంగా జిల్లాలో తగ్గుతున్న బాలికల జనన నిష్పత్తి, స్కానింగ్ సెంటర్ల పర్యవేక్షణ, డెకాయ్ ఆపరేషన్ల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి కమిటీ సభ్యుల సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, ఆడశిశువు అని తెలిసి గర్భస్రావానికి పాల్పడడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మూడు స్కానింగ్ యంత్రాలను స్వాధీనం (సీజ్) చేసామని తెలిపారు. ఎక్కడైనా మొబైల్ స్కానింగ్ యంత్రాలు వినియోగిస్తున్నా లేదా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం ఉంటే 63000 30940 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో, లింగ నిర్ధారణకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం అందించి అక్రమాలను వెలికితీసేందుకు సహకరించిన వారికి రూ.50,000 ప్రోత్సాహక బహుమతి ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఇప్పటికే ఒకరు లేదా ఇద్దరు ఆడపిల్లలను కలిగిన కుటుంబాలపై ప్రత్యేక దృష్టి సారించి, లింగ వివక్షతపై అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టం ప్రకారం గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో మాత్రమే నిర్దిష్ట పరిస్థితుల్లో చట్టబద్ధంగా గర్భస్రావానికి అవకాశం ఉంటుందని, అయితే పుట్టబోయే శిశువు ఆడపిల్ల అని తెలుసుకుని గర్భస్రావానికి పాల్పడటం నేరమని వైద్యులు వివరించారు. నాటు వైద్యం, స్వయంగా మందులు వాడటం లేదా అర్హతలేని వ్యక్తుల వద్ద చికిత్స చేయించుకోవడం వల్ల ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జీఎంహెచ్ గైనకాలజిస్టు ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి , పరకాల సీఎచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, మాతా-శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రజిత, గైనకాలజిస్టులు డాక్టర్ కవిత, డాక్టర్ రూబీనా, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో తాళ్లూరి లత, డాన్ బోస్కో సంస్థ ప్రతినిధి ఈ. రాజు, పి. శారద, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ పద్మజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక లాభాలు

- **లెక్టర్ స్నేహ శబరీష్**
- **ఏటిగడ్డ తండాలో విత్తన మేళా**
- **హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, అధికారులు**

**మహబూబాబాద్, జులై 27(ప్రభాత గమనం):**



సోమవారం మహబూబాబాద్ పట్టణం ఏటిగడ్డ తండ రైతు వేదికలో విత్తనమేళ ప్రారంభించిన సందర్భంగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ తో కలిసి జిల్లాలో ప్రాజెక్టు వైవిద్యం కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ కంపెనీల ప్రతినిధులు ఏర్పాటు చేసిన విత్తనాల స్టాల్స్ ను సందర్శించారు.రైతులతో స్వయంగా మాట్లాడి ప్రత్యామ్నాయ ప్రణాళి కకు అనుగుణంగా విత్తనాలను (సీడ్స్) ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ...సూపర్ ఎల్ నినో ప్రభావం వలన ప్రస్తుత వర్షాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఎస్సారెస్పీ, ఇతర నీటి వనరులు కూడా అందుబాటులో లేనందున రైతులు కొంత ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుందని, ఇట్టి విషయాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ పంట మార్పిడి వైపు అడుగులు వేసి ఆరుతడి పంటలు, కూరగాయల పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడి లాభాలు కూడా వస్తాయని కోరారు.ప్రతి రైతు తనకు ఉన్న భూమిలో సాధ్యమైనంత వరకు నీటి కుంట (పంట కుంట)ను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నీటి వనరులు అందు బాటులో ఉంటాయని సూచించారు.తాను కూడా తన వ్యవసాయ క్షేత్రంలో పంట కుంట ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకుకూరల పంటలను పండిస్తా నని, కేవలం సేంద్రీయ ఎరువులతో తన కుటుంబానికి సరిపోయే మాత్రమే వరి వేసుకుంటానని తెలిపారు.జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ సేంద్రియ ఎరువులు పంట మార్పిడి విధానం తదితర వ్యవసాయం కు సంబంధించిన అన్ని అంశాలను తెలియపరచడం జరుగుతుందని ప్రతి ఒక రైతు ప్రభుత్వం సూచించిన పంటలను వేసుకుని అధిక లాభాలు పొందాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ... ప్రస్తుత సూపర్ ఎల్ నినో వాతావరణ నేపథ్యంలో జిల్లాలో ఆరుతడి పంటలు, కూరగాయల పంటల ప్రోత్సాహం, తక్కువ నీటితో ఎక్కువ సాగు రైతులకు సుస్థిర వ్యవసాయం ఆహార భద్రత, వరి, పత్తి, మిరప, మక్క జొన్న పంటలు కాకుండా తక్కువ నీటి ద్వారా పండే ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేయాలని అందుకోసం జిల్లాలో ప్రాజెక్ట్ వైవిధ్యం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లాలో పంట మార్పిడి విధానం ద్వారా వ్యవసాయ, ఉద్యాన,పట్టు పరిశ్రమల శాఖల ద్వారా గ్రామ గ్రామాన విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి మండల స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్ అధికారులు రైతు వేదికలలో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రస్తుతం వేయవలసిన పంటల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం సూచించిన ప్రకారం వ్యవసాయ శాఖ అధికారుల నుండి సమాచారం సేకరించి కూరగాయలు,ఆకుకూరలు, ఆరుతడి పంటలు,సాగు చేయాలని కోరారు. అధికంగా వరి పండించడం వలన, అధిక యూరియా వాడకం, కాన్సర్ రావడం, భూసారం కోల్పోవడం, అవసరం కంటే ఎక్కువ మిల్లుల ఏర్పాటు, బీహార్, చత్తీస్గఢ్ నుండి హమాలీ లను రప్పించుకోవాల్సిన అవసరాలు, రవాణా, నిలువ చేసే గోడౌన్ ల విష యాలలో పలు సమస్యలు ఎదుర్కుంటున్నామని తెలిపారు. పసుపు, వేరు శనగ విస్తీర్ణం తగ్గడం వలన పరిశ్రమలు మూత పది చాలా మంది ఉపాధి కొల్పయారని తెలిపారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలైన అపరాలు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్లు, పూలు, మల్బరీ, మునగ, ఉల్లి వంటి పంటలు సాగు చేయడం వలన రైతుకు ఆదాయం తో పాటు పలు పరిశ్రమలు ఏర్పాటు జరిగి ఎంతో మంది ఉపాధి కలిగే అవకాశం ఉందని రైతులకు తెలిపారు. ప్రతి రైతు మనస్ఫూ ర్తిగా పంట మార్పిడి విధానం వైపు మొగ్గు చూపాలని భవిష్యత్తు తరాల మనుగడ ఆరోగ్యం కోసం ఇతర పంటలు పెసర్లు, వేరుశనగ, కూరగాయలు, చిరుధాన్యాలు, తదితర పంటల సాగును స్ఫూర్తితో కొనసాగించాలని సూచించారు. విబిజి రామ్ జి పథకం లో 5 ఎకరాల లోపు ఉన్న రైతులు పంట కుంటలు (నీటి కుంటలు) ఏర్పాటు చేసుకోవాలని అలాగే మునగ తోటల పెంపకం కూడా సదరు పథకం ద్వారా నాటు కోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వరి పండించడం ద్వారా ఎక్కువగా ఉపయోగం లేదని మూడు పూటలా భోజనాలు చేస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు, ప్ర తి ఊరిలో అన్ని రకాల పంటలు పండించడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు. జిల్లాలోని సుమారు 2 లక్షల పైచిలుకు రైతుల డిమాండ్ కనుగుణంగా వారు కూడా సమిష్టి సమన్వయం (సిండికేట్ అయ్యి) డిమాండు ఉన్న పంటలను పండించి అధిక లాభాలు పొందాలని కోరారు.

## బెల్ట్ షాపులపై పోలీసుల మెరుపు దాడులు


**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



మండల పరిధిలోని సిద్ధాపూర్, వంగపాడు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై హసన్‌పర్తి పోలీసులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, సిద్ధాపూర్, వంగపాడు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో దాడులు చేపట్టారు. తనిఖీల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తాబేటి యుగేందర్, ముస్కు శ్రీనాథ్, ముస్కు నరసింహులు అనే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## పోగొట్టుకున్న బంగారు బ్రాస్ లెట్ అప్పగింత





**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రజలకు భరోసాగా నిలుస్తూ కాజీపేట పోలీసులు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. జూడియో షోరూమ్‌లో పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను గుర్తించి యజమానికి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. డీజిల్ కాలనీకి చెందిన నరేష్ జూడియో షోరూమ్‌లో షాపింగ్ చేస్తున్న సమయంలో తన బంగారు బ్రాస్‌లెట్‌ను అనుకోకుండా పోగొట్టుకున్నారు. దీంతో ఆయన కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్‌హెచ్‌ఓ శ్యాంసుందర్ వెంటనే స్పందించి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్ ఆదేశాల మేరకు క్రైమ్ పీసీలు వి. క్రాంతి కుమార్, కుమార్‌లు సీసీటీవీ దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి పోయిన బంగారు బ్రాస్‌లెట్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని యజమాని నరేష్‌కు అప్పగించారు. తన పోగొట్టుకున్న విలువైన బంగారు ఆభరణాన్ని తిరిగి అందజేసినందుకు నరేష్, ఆయన కుటుంబ సభ్యులు సీఐ శ్యాంసుందర్, క్రైమ్ పీసీలు వి. క్రాంతి కుమార్, కుమార్‌తో పాటు కాజీపేట పోలీసు సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తుల రక్షణకు, పోయిన వస్తువులను గుర్తించి బాధితులకు అప్పగించడంలో కాజీపేట పోలీసులు చూపుతున్న చొరవ అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు. ప్రజాసేవే లక్ష్యంగా కాజీపేట పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.

## కలాం ఆశయాలు విద్యార్థులకు ఆదర్శం

**కేసముద్రం జులై 27(ప్రభాత గమనం):**



భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా పేరుగాంచిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సోమవారం శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...డాక్టర్ అబ్దుల్ కలాం నిరాడంబర జీవితం, దేశాభివృద్ధి కోసం చేసిన సేవలు, యువతపై ఉంచిన విశ్వాసం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివితేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని కలాం సందేశాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కలాం జీవిత విశేషాలను, శాస్త్ర సాంకేతిక రంగంలో ఆయన చేసిన విశేష కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## నీట్ బాధితులకు రూ. కోటి చెల్లించాలి

- **గార్ల మండల కేంద్రంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన**
- **అమరవీరుల స్తూపం వద్ద విద్యార్థులకు నివాళులు**
- **కేంద్రమంత్రి రాజీనామా ప్రజాస్వామ్య విజయం: కట్టెబోయిన శ్రీనివాస్**

**గార్ల , జూలై 26 ( ప్రభాత గమనం):**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన 21 మంది విద్యార్థుల మృతికి నిరసనగా గార్ల మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మృతి చెందిన విద్యార్థులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ... నీట్ అక్రమాల నేపథ్యంలో విద్యార్థులు చేపట్టిన ఉధృత పోరాట ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని, ఇది విద్యార్థి ఉద్యమం, ప్రజాస్వామ్య వ్యవస్థ సాధించిన గొప్ప విజయమని పేర్కొన్నారు.పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన ప్రతి విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 1 కోటి నష్టపరిహారం చెల్లించాలి. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పాశవికంగా లాఠీఛార్జ్ చేసిన పోలీసు అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా మారిన నీట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, ఆయా రాష్ట్రాలే స్వయంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునేలా అధికారం కల్పించాలి.దేశంలో కుదేలవుతున్న విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ మండల సమితి సభ్యులు కట్టెబోయిన పిచ్చయ్య, భూక్య హరినాయక్, ధరావత్ వీరన్న, లావుడియా భీముడు, బాదం రాజేష్ లతో పాటు వీరికి సంఘీభావంగా జానీ మియా, ధరావత్ బాబురావు, సెట్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలు స్వాధీనం

**ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను ఖానాపూర్ ఎస్సై రామ్మోహన్ స్వాధీనం చేసుకుని అటవీ శాఖకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే ఖానాపూర్ ఎస్సై రామ్మోహన్ తమ సిబ్బందితో కలిసి పెట్రోల్ బంక్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో అలంకుంటకు చెందిన మురళి వద్ద నుంచి సుమారు 9 అడుగుల పొడవు గల టేకు దుంగను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.18,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం స్వాధీనం చేసుకున్న కలపను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

# ప్రజా సేవే పోలీసుల బాధ్యత

- **పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**
- **హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సీపీ**

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సోమవారం సెంట్రల్ జోన్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ ఆవరణ, మౌలిక సదుపాయాలు, పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ పరిధిలో తరచూ నమోదవుతున్న నేరాల వివరాలు, గ్రామాల పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణపై ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు తప్పనిసరిగా రశీదు అందజేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన ఆమె, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు పై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, చోరీల నివారణ కోసం పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. నమోదైన ప్రతి కేసును నిష్పక్షపాతంగా, నాణ్యమైన దర్యాప్తుతో వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు.



## గుడుంబా స్థావరంపై దాడి

- **20 లీటర్ల బెల్లం సారా ధ్వంసం**

**ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

అక్రమ మద్యం తయారీ, విక్రయాల నియంత్రణలో భాగంగా ఖానాపూర్ ఎస్సై రామ్మోహన్ తమ సిబ్బందితో కలిసి ఆదివారం నాజీ తండాలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తేజావత్ కౌసల్య నివాసంలో సుమారు 20 లీటర్ల గుడుంబా బెల్లం సారాను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఘటనపై కేసు నమోదు చేశారు ఎస్సై రామ్మోహన్ మాట్లాడుతూ గుడుంబా అమ్మిన రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు



## ఆరుతడి పంటలే శ్రేయస్కరం

- **గార్ల రైతు వేదికలో ఉచిత విత్తనాల పంపిణీ**
- **రాయితీపై కంది, పెసర, మినుము విత్తనాలు అందజేత**
- **హాజరైన స్థానిక సర్పంచ్‌లు, వ్యవసాయ అధికారులు**

**గార్ల, జూలై 26( ప్రభాత గమనం):**

ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి, స్వల్పకాలిక పంటల సాగుపై దృష్టి సారించాలని ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు.సోమవారం గార్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'విత్తన మేళా' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గార్ల సర్పంచ్ బానోత్ పార్వతి, రాజు తండా సర్పంచ్ బానోత్ సుశీల, గోపాలపురం సర్పంచ్ భూక్యా భారతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రామారావు, ఏఈఓలు సాయి ప్రకాష్, పూజితలతో కలిసి రైతులకు రాయితీపై కంది, పెసర, మినుములు తదితర పప్పుధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ.. వరి మాగాణుల్లో నీటి కొరత కారణంగా పూర్తిస్థాయిలో నీరు అందే అవకాశం లేనందున, ప్రత్యామ్నాయంగా పెసర వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ఎంతో మేలని తెలిపారు. దీనివల్ల తక్కువ వ్యవధిలోనే పంట చేతికి రావడమే కాకుండా, భూసారం గణనీయంగా పెరుగుతుందన్నారు. అలాగే, రోజువారీ ఆదాయం కోసం కూరగాయలు, తక్కువ నీటితో పండే చిరుధాన్యాల సాగు వైపు రైతులు ఆలోచన చేయాలని కోరారు.పంటల సాగులో వ్యవసాయ అధికారుల సాంకేతిక సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారి రామారావు సూచించారు. సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ మరియు జీవన ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా నేల కాలుష్యాన్ని నివారించి భూసారాన్ని కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ ట్యాక్స్ లు చెల్లించని కమర్షియల్ వాహనాలపై చర్యలు

- **డీటీవో శంకర్ నాయక్**

**ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



జిల్లాలోని కమర్షియల్ వాహన యజమానులు పెండింగ్‌లో ఉన్న వాహన పన్నులను గడువులోగా తప్పనిసరిగా చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా అధికారి (డీటీవో) శంకర్ నాయక్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని రకాల కమర్షియల్ వాహనాల యజమానులు, ముఖ్యంగా ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (PUC) సర్టిఫికెట్ తదితర పత్రాలను ఎల్లప్పుడూ చెల్లుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొంతమంది వాహన యజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందకపోవడం, పర్మిట్‌ను పునరుద్ధరించకపోవడం, వాహన పన్నులు సకాలంలో చెల్లించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అలాగే కొందరు రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ లేకుండానే వాహనాలను నడుపుతుండగా, మరికొందరు వాహనం కొనుగోలు చేసినప్పటి నుంచి వాహన పన్ను చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు పెండింగ్‌లో ఉన్న వాహన పన్నులను మీ సేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని డీటీవో శంకర్ నాయక్ సూచించారు. గడువులోగా ట్యాక్స్‌లు చెల్లించని కమర్షి యల్ వాహన యజమానులపై, ముఖ్యంగా ట్రాక్టర్ యజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడంతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ప్రజాదివాస్ లో పాల్గొన్న ఎస్పీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 12 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్

**హైదరాబాద్, జులై 27(ప్రభాత గమనం):**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది.



ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.




## డీఎస్ఎఫ్ఐలోకి భారీగా చేరికలు

- ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి కేలోత్ సాయి కుమార్
- పెద్దగూడూరు మండల కేంద్రంలో కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలి
- డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోత్ సాయి కుమార్, సూర్య ప్రకాష్
- పెద్ద గూడూరు మండల కమిటీ ఎన్నిక

**గూడూరు, జులై 27(ప్రభాత గమనం):**

డిఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై మహబూబాబాద్ జిల్లా పెద్దగూడూరు మండల కేంద్రంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం పెద్దగూడూరు మండల కేంద్రంలో డిఎస్ఎఫ్ఐ లో భారీగా చేరారు. ఈ సందర్భంగా డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోత్ సాయి కుమార్, రాష్ట్ర నాయకుడు సూర్య ప్రకాష్ లు నూతనంగా చేరిన నాయకులకు సంఘం కండువాలు కప్పి విప్లవాత్మక శుభాకాంక్షలతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేలోత్ సాయి కుమార్, సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థి లోకం ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక శక్తి డిఎస్ఎఫ్ఐ మాత్రమేనని పేర్కొన్నారు. డిఎస్ఎఫ్ఐ బలమైన విద్యార్థి ఉద్యమాలను నిర్మిస్తూ, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.పెద్దగూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న గ్రామీణ, పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారందరికీ ఉపయోగపడేలా మండల కేంద్రంలో తక్షణమే కళాశాల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు హాస్టల్ వసతి లేక చదువుకు దూరమయ్యే పరిస్థితి దాపురించిందని, అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి హాస్టల్ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ దేవేందర్,జిల్లా నాయకుడు దీపక్, మండల నాయుకులు చరణ్, చింటూ, నవీన్ ,ఉరిఫ్ కార్తీక్, లెనిన్, వినయ్, మధు, అజయ్, సిద్ధూ, కేష్వ, లోకేష్, సంజయ్ పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు ఆంగ్లం లోనే బోధించాలి

**కేసముద్రం, జూలై 27(ప్రభాత గమనం):**

ఉపాధ్యా యులు ఆంగ్లంలోనే బోధించాలి,విద్యార్థు లతో ఆంగ్లంలోనే మాట్లాడాలని కోర్సు డైరెక్టర్,కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు.ఎఫ్ఎల్ఎన్ ఎన్రిచ్మెంట్ కార్యక్రమం లో భాగంగా 3 వ రోజు సోమవారం కేసముద్రం విలేజ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లము, గణితం పై ఉపాధ్యా యులకు ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న మండల విద్యాధికారి కాలేరు యాదగిరి మాట్లాడు తూ..ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో బోధన చేసేట పృడు ఏ పిల్లలైతే అభ్యసనంలో వెనుకబడి ఉంటారో వారిని గుర్తించి ఒక గ్రూపుగా విభజించి లక్ష్యాధారిత బోధనను కొనసాగించాలని, అదేవిధంగా మారిన కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులందరూ చక్కగా ఆంగ్లం నేర్చుకుని ఆంగ్లంలోనే విద్యా బోధనను కొనసాగిం చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం విలేజ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, తాళ్లపూస పల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య,ఆర్పీలు వట్నాల సత్యనారా యణ,వై.అశోక్,వి. భాస్కర రావు,ఎన్నం భాస్కర్, కె.సురేష్ తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- వసతి గృహాల ఇన్స్ స్పెక్షన్ అధికారులు నివేదికలు సమర్పించాలి
- శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అందుకు అనుగుణంగా ముందుకు సాగాలి...
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, జులై 27(ప్రభాత గమనం):**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, జిల్లాలోని అన్ని విభాగాల ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ అమలుకు యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో . అదనపు కలెక్టర్ రెవెన్యు కె.అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డి.ఆర్.ఓ నాగలక్ష్మి , ట్రైనీ డిప్యుటీ కలెక్టర్ నితీష్ కుమార్ ల తొ కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సంది మహబూబ్ రెడ్డి తనకు ఉన్న భూమిలో గల సర్వే నెంబర్ లో ఈ మధ్య జరిగిన భూభారతి డిజిటల్ సర్వే లో తొమ్మిది గుంటలు తక్కువగా చూపిస్తుందని, అట్టి భూమి సర్వేయర్ ద్వారా తిరిగి సర్వే చేపించి సరిచేసి ఇవ్వగలరని కోరారు. మహబూబాబాద్ పట్టణం సిగ్నల్ కాలనీ కి చెందిన శ్రీ రామ మౌనిక తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని, ఇందిరమ్మ ఇల్లు మొదటి జాబితాలో ఇల్లు మంజూరు అయింది కానీ రేషన్ కార్డు లేక పోవడంతో ఇందిరమ్మ ఇవ్వడానికి నిరాకరించారని రెండవ విడతలో నైనా ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన రుద్ర భాస్కర్ తన పాత పాస్ బుక్ లోని పట్టా భూమి ప్రభుత్వం జారీ చేసిన కొత్త పాస్ బుక్ నమోదుకు వచ్చే సరికి మొత్తం భూమి రికార్డు కాలేదని కార్యాలయాల చుట్టూ ఎంత తిరిగిన సమస్యకు పరిష్కారం అవట్లేదని దయచేసి తన సమస్య పరిష్కరించాలని కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజవాణిలో (184) దరఖాస్తులు వచ్చిన వినతులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారం కొరకు ఆదేశించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలోని అన్ని విభాగాల వారు ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో నిర్వహించబోయే కార్యక్రమాలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు శాఖలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలని తద్వారా నిర్దిష్టమైన వేగమైన పనులు జరుగుతాయని అట్టి నివేదికలను ప్రతి తనకు సమర్పించాలని కలెక్టర్ సంబంధిత విభాగాలను ఆదేశించారు, ముఖ్యమంత్రి గ్రీవెన్స్, జిల్లా గ్రీవెన్స్ లపై శాకలవారీగా సమీక్ష సమావేశం నిర్వహించి దరఖాస్తుదారులకు వెంటనే లిఖితపూర్వకంగా సమాధానాలు పరిష్కారాలు చూపాలని, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, వారు క్షేత్రస్థాయిలో పిల్లలతో కలిసి భోజనం చేసి వసతి గృహం లోని సౌకర్యాలను తనిఖీ చేయాలని అట్టి నివేదికను వెంటనే తమకు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కేసీఆర్ పరామర్శ

**హైదరాబాద్,ప్రభాతగమనం,జూలై27:**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కి చేరుకున్నారు. కేసీఆర్ యశోద హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబ సభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించారని తెలిసిందే.



## సహకార సంఘాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

- కల్పలత సూపర్ బజార్ సొసైటీని తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ నగరంలోని రంగంపేటలో ఉన్న కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సూపర్ బజార్‌లో వినియోగదారులకు అందిస్తున్న సేవలు, నిత్యావసర సరుకుల లభ్యత, వస్తువుల నాణ్యత, నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేసి ఇంధన విక్రయాలు, నిల్వలు, రోజువారీ లావాదేవీలు, నిర్వహణ తీరుపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. తదుపరి సూపర్ బజార్‌లోని టెక్స్‌టైల్స్ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, ముఖ్యంగా చేనేత వస్త్రాలు, చేనేత చీరల విక్రయాలు, నాణ్యత, నిల్వలపై ఆరా తీశారు. స్థానిక చేనేత ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠ్యపుస్తకాల పంపిణీ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సహకార సంఘ సభ్యుల సంఖ్య, సంఘం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ-వ్యయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాలు పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, సభ్యులతో పాటు సాధారణ వినియోగదారులకు కూడా నాణ్యమైన సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు.

# ప్రజలకు మెరుగైన సేవలే పోలీసుల లక్ష్యం

- రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, మహబూబాబాద్ రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ నిర్వహించి శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన హత్యలు, ఆస్తి నేరాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, పెండింగ్ కేసులు, చార్జిషీట్లు, కోర్టు వ్యవహారాల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని ఎస్పీ ఆదేశించారు. స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి కేసు, ఫిర్యాదు, దర్యాప్తు వివరాలు, అరెస్టులు, చార్జిషీట్లు, వారెంట్లు, ఆస్తుల స్వాధీనం తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, పెండింగ్ ఎంట్రీలు లేకుండా డేటా నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. డిజిటల్ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గంజాయి, డ్రగ్స్, గుడుంబా, అక్రమ మద్యం తయారీ, విక్రయాలు, రవాణాపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. అలాగే నైట్ పెట్రోలింగ్, నైట్ బీట్స్, వాహన తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల తనిఖీలు, హైవేలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద పటిష్టమైన గస్తీ నిర్వహిస్తూ దొంగతనాలు, చోరీలు, ఇతర నేరాలను ముందస్తుగా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామానికి సంబంధించిన శాంతిభద్రతల పరిస్థితులు, గ్రామాల వారీ సమస్యలు, కమ్యూనిటీ టెన్షన్స్, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, నేర ప్రవృత్తి గల వ్యక్తుల కదలికలు, బైండోవర్ కేసులు, పాత కక్షలు, భూ వివాదాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ అమలును ప్రత్యేకంగా సమీక్షిస్తూ ప్రతి గ్రామాన్ని తరచూ సందర్శించాలని, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులతో నిరంతరం సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గ్రామస్థాయిలో పోలీస్-ప్రజల అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న కేసులను నాణ్యమైన సాక్ష్యాధారాలతో వేగంగా పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, షీ టీమ్స్, సైబర్ అవగాహన కార్యక్రమాలు, సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తృతంగా పెంచుతూ నేరాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మాల్ఖానా నిర్వహణ, ఆయుధాల సంరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. శుభ్రమైన, క్రమబద్ధమైన పోలీస్ స్టేషన్ ప్రజల్లో పోలీస్ శాఖపై సానుకూల భావనను పెంపొందిస్తుందని తెలిపారు. ఇటీవల రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని సమయస్ఫూర్తితో రక్షించిన మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి, బ్లూ కోల్ట్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సేవాభావంతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంజలి, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజు, సతీష్, రవి కిరణ్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374